"సంతానంలో ఏ బిడ్డ ఐక్యూ రీత్యా వున్నతుడవుతాడు."

"మిచిగాన్ సైకాలజిస్ట్ రాబర్ట్ బి జాజన్ థియరీ ప్రకారం అందరిలో పెద్ద పిల్లాడే 'IQ' రీత్యా బెటరుగా వుంటాడు. కారణం అతడి కన్నా పెద్ద పిల్లలు ఆ యింటిలో వుండరు కాబట్టి పెద్దల ఆలోచనల సరళితోనూ, తెలివితోనూ ఎక్కువగా సంపర్కం వుంటుంది కాబట్టి."

'బాప్‌రే' అనుకున్నాడు విశ్వ. ఆదిలో పెద్ద స్పందన లేకపోయినా కృషికి అనుకూలంగా విద్యార్థులు చప్పట్లు కొట్టడం ప్రారంభించారు వున్నట్టుండి.

కృషిని ఇబ్బంది పెట్టాలీ అంటే యిది కాదు పద్ధతి అనుకున్నాడేమో టక్కున అడిగాడు "హరికథా పితామహుడైన ఆదిబట్ల నారాయణ దాసు పుట్టింది ఏ వూర్లో."

"శ్రీకాకులం జిల్లాలోని అజ్జాడ గ్రామంలో"

ఇబ్బందిగా చూశాడు విశ్వ . . . ఎక్కడో అమెరికాలో చదివి తిరిగి వచ్చిన కృషి ఇలా తెలుగు రాష్ట్రంలోని పల్లెటూర్ల గురించి మాట్లాడడం బొత్తిగా నచ్చడం లేదు.

"ఎన్ సైక్లోపిడియా అన్నది మౌలికంగా ఏ భాషకి చెందిన పదం"

"అది గ్రీక్ పదం . . . దానికి అర్థం జ్ఞానచక్రం"

"తమలపాకులలో వున్న విటమిన్లు?"

'ఎ', 'సి' విటమిన్లతో బాటు ప్రొటీన్లు, కాల్షియం, భాస్వరం కూడ వున్నాయి."

"తమలపాకులకి దారుణంగా అలవాటుపడి ఓ దశలో డబ్బుల్లేక రాజముద్రికని, కిరీటాన్ని తాకట్టు పెట్టి తమలపాకుల్ని తెప్పించుకున్న రాజెవరు. . ."

"పదకొండో శతాబ్దంలో కాశ్మీరుని పరిపాలించిన రాజు అనంత"

"తల స్నానానికి షాంపు వాడుతుంటారుగా. అసలు షాంపూ అనే పదానికి మూలం ఏమిటి."

క్షణం ఆగి చెప్పింది కృషి "జుట్టుని పాయలుగా విడదీసి కలిపి రుద్ది దువ్వే ప్రక్రియని 'చంప్‌నా' అంటారు హిందీలో. . . షాంపూ అనే పదానికి మూలం ఈ చంప్‌నాయే"

క్రమంగా సహనాన్ని కోల్పోతున్నాడు విశ్వ.

"భారత జాతీయ పతాకంలోని అశోకచక్రంలో ఎన్ని గీతలుంటాయి."

"ఇరవై నాలుగు"

"పందులు సాధారణంగా ఎంత కాలం గర్భంతో వుంటాయి."

"మూడు నెలల మూడు వారాల మూడు రోజులు."

"తుమ్ ముజే ఖూన్ దో మై తుమ్హే ఆజాద్ దూంగా అన్న నినాదాన్నిచ్చిన స్వాతంత్ర్య సమరయోధుడెవరు."

"సుభాష్ చంద్రబోస్."

"ప్రతి చిన్న విషయానికీ కళ్ళనీళ్ళు పెట్టుకునే స్త్రీల కళ్ళల్లో ఆ నీళ్ళు రావటానికి కారణమైన గ్రంధులేవి."

“కన్నీళ్ళన్నవి కేవలం ఆడవాళ్ళకి మాత్రం పరిమితం కాదు మిస్టర్ విశ్వ - ఓడే స్థితి వస్తే మగాడికీ కన్నీళ్ళు తిరుగుతుంటాయి” విశ్వ ప్రస్తుత స్థితి నుద్దేశించి మాట్లాడుతున్నట్టుగా అంది “కమింగ్ టుది పాయింట్ - కన్నీళ్ళు రావటానికి కారణమైన గ్రంథులు లాక్రైమల్ గ్లేండ్స్.”

“టిగ్రెనియాభాష ఏ దేశానికి చెందింది.”

“ఇథియోపియా. . .”

“స్వామి వివేకానంద అసలు పేరు”

నిశ్శబ్దం. . . గుర్తు చేసుకునే ప్రయత్నం చేసినా స్ఫురించక పోవడంతో “పాస్” అంది కృషి.

“నరేంద్రనాథ్ దత్తా” అన్నాడు విశ్వ .

కృషిలో ఏ సంచలనమూ లేదు. చాలా మామూలుగా వుంది అంటే - గెలిచే తీరుతానన్న నమ్మకమా.

“నువ్వటే” సీరియస్‌గా అన్నాడు కృషిని చూస్తూ “పువ్వులాంటి వయసు నవ్వులంటిన సొగసు రువ్వి నా యెదపాయను పర్వులెత్తావటే - నువ్వటే.” క్షణం ఆగి “ఇది మీ గురించి నేను భావుకంగా మాట్లాడ్డం కాదు మిస్ కృషీ. . . ఓ ప్రముఖ జానపద గీతం ఇది. . . రాసిందెవరో చెప్పండి.”

“బాపిరాజు” చెప్పేసింది కృషి నిశ్చలంగా.

విశ్వ నుదుట స్వేదం పేరుకుంది.

“మొదటి రాజీవ్ ఖేల్ రత్న అవార్డ్ గ్రహీత ఎవరు”

“విశ్వనాథన్ ఆనంద్”

“పృధ్వీ క్షిపణి రూపశిల్పి ఎవరు”

“డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్”

“నిద్రపోయేటప్పుడు పాము ఎందుకు కళ్ళు మూయదు.”

“అవాక్కయి చూసింది కృషి.”

పది సెకండ్లు గడుస్తూండగా బజర్ మోగడంతో చెప్పాడు విశ్వ “పాము నిద్ర పోయేటప్పుడు కళ్ళు మూయదు - దానికి రెప్పలు లేవు కాబట్టి”

పాతిక ప్రశ్నలు పూర్తయిన సూచనగా పైకి లేచిన సత్యేంద్రబసు మైక్‌లో అనౌన్స్ చేశాడు. “మిస్టర్ విశ్వనాథ్ నిబంధనల మేరకు అడిగిన ప్రశ్నలు ఇరవై అయిదు. అందులో మిస్ కృషి చెప్పలేక పోయిన జవాబులు మూడు మాత్రమే. సో. . . హెర్ స్కోర్ యీజ్ టూ హండ్రెడ్ అండ్ ట్వంటీ.”

ఆడిటోరియం కరతాళధ్వనులతో ప్రతిధ్వనిస్తూండగా అన్నాడు సత్యేంద్ర “నౌ దిసీజ్ ద టర్న్ ఆఫ్ మిస్ కృషి. . . ప్లీజ్ స్టార్ట్ మిస్ కృషి. . .”

రెండు సెకండ్ల పాటు రెప్పలార్చకుండా చూసిన కృషి అడిగింది "ఎద లోపలి యెదలో నెమ్మదిలో జీవిత రహస్యమార్గమ్ములలో వద అని కోరికవై నా బ్రతుకు బరువులెల్ల పాట పాడింతు సఖీ రాసిందెవరు"

"కృష్ణశాస్త్రి"

"గుడ్" అభినందనగా చూసింది "కొండ తిరిగీ కోన తిరిగీ చీర చెరుగున కూరిచితిరా - గరికెపూవుల కంఠమల - ఆవునడిగీ అడవినడిగి పూల గిన్నెల పొందుపరిచితి-"

ఆమె వాక్యాలు యింకా పూర్తికాకముందే చెప్పాడు విశ్వ "నండూరి రాసిన జానపదగీతంలోని పంక్తులవి"

"ప్రపంచ ప్రముఖురాలైన బ్రిటిష్ నర్స్ ఫ్లారెన్స్ నైటింగేల్ వీలునామా నిర్లక్ష్యం చేయబడింది. ఎలా" ఇక్కడ విశ్వ తెల్లమొహం చేస్తాడనుకుంది. కాని వెంటనే చెప్పేయగలిగాడు "1910లో మరణించిన ఫ్లారెన్స్ నైటింగేల్ వీలునామా ప్రకారం ఆమె శరీరాన్ని సైన్స్ పరిశోధనకి అందించాలని కోరింది. ఆమె తల్లిదండ్రులు ఖననం చేయబడ్డ హేంప్‌షేర్ సిమెట్రీలోనే ఆమె శవమూ ఖననం చేయబడింది."

"మూడు పెళ్ళిళ్ళు విఫలమైన టెర్ ట్రండ్ రస్సెల్ తన ఎనభయ్యో యేట నాలుగో పెళ్ళి చేసుకున్నాడు - ఆమె పేరు".

"ఎడిత్ ఫించ్"

"రైట్. . ." ఈ సారి అతడ్ని కవ్విస్తున్నట్టుగా అడిగింది " 'లౌ' అంటే ప్రపంచంలో చాలా చరిత్రగలదైనా టెన్నిస్‌లో మాత్రం సున్నాని సూచిస్తుంది - ఎందుచేత."

"LOVE" అనే పదానికి మూలం ఫ్రెంచి భాషలోని LOEUF ఈ ఫ్రెంచ్ పదానికి ఆ భాషలో అర్థం గుడ్డు అని - గుడ్డు రూపం జీరోకి దగ్గరగా వుంటుంది కాబట్టి నన్ స్కోర్‌కి LOVE అనే పదం వచ్చింది."

"వేడిచేసి చల్లబరిచిన నీళ్ళు కప్ నీళ్ళలో ఏవి తొందరగా గడ్డకట్టే గుణం కలిగి వుంటాయి."

"తప్పకుండా వేడిచేసి చల్లబరిచిన నీళ్ళే. . .ఎందుకంటే అందులో బుడగలు వుండే అవకాశం లేదు కాబట్టి."

"ఇద్దరుంటే కంపెనీ ముగ్గురుంటే గుంపు అయితే నలుగురూ అయిదుగురూ వుంటే."

"తొమ్మిదిమంది" ఎగతాళిగా అన్నాడు విశ్వ.

విశ్వ ఆలోచించుకునే అవకాశ మివ్వనట్టుగా అడిగింది కృషి. "ఒక మగాడు తన భార్య వితంతువైతే ఆమె చెల్లెల్ని చట్టరీత్యా పెళ్ళి చేసుకోవచ్చా"

"యస్ - చేసుకోవచ్చు" అన్నాడు టక్కున.

"రాంగ్" నెమ్మదిగా అంది కృషి. . ."నువ్వు బ్రతికుండగానే నీ భార్య వితంతువయ్యే అవకాశం లేదుగా"

షాక్ తిన్నట్టుగా చూశాడు. . . చాలా తెలివిగా తప్పుదోవ పట్టించింది.

"మూడు ఏపిల్స్‌లో మీరు రెండు తీసుకుంటే మీ దగ్గర ఎన్ని మిగిలినట్టు. . ."

"ఒకటి. . ." కృషి ముఖకవళికల్ని చూస్తూ అన్నాడు. "కాదు కృషీ-రెండు. . . ఎందుకంటే నేను ఎక్కడో వున్న మూడు ఏపిల్సులో రెండు తీసుకున్నాను కాబట్టి నా దగ్గర వుండేది రెండే. . ."

"నాట్ బేడ్" అన్నట్టుగా నవ్వింది కృషి "పది సెకండ్లలో చెప్పాలి . . ." వున్న గడువు అదే అని ఆమెకీ తెలుసు కాని విశ్వుని సైకలాజికల్‌గా యిబ్బంది పెట్టాలనుకుంది "కలిపినా లేక గుణించినా ఒకే మొత్తం వచ్చే మూడు అంకెల్ని చెప్పండి"

"ఒకటి రెండు మూడు"

"ప్రేమ విషయంలో అబ్బాయి అమ్మాయిల ఆలోచనా సరళి గురించి మోడరన్ సైకాలజీ ఏం చెబుతుంది"

"తొందరగా ప్రేమలో పడేది మగాడే అంటూంది సైన్స్."

ఆడిటోరియంలోని అమ్మాయిలు ఉత్సాహంగా చప్పట్లు కొట్టారు. "ఆ తర్వాత ప్రేమ విఫలమయినా మరిచిపోలేక బాధ పడేదీ మగాడే అంటుంది. . . అమ్మాయి విషయానికి వస్తే ఆమె తొందరగా రాజీ పడగలదన్నది సైన్స్ చెబుతున్న సత్యం. అంటే ప్రేమలో ఎక్కువ బాధను అనుభవించేది అబ్బాయిలే పాపం"

ఈ సారి విద్యార్థులు విశ్వుకి సపోర్టుగా చప్పట్లు కొట్టారు.

"ప్రపంచంలో మొదటిసారిగా ఇంటెల్లిజన్స్ టెస్ట్‌ల కోసం ప్రయత్నం జరిగిందెప్పుడు."

"క్రీస్తు శకం 1900 సంవత్సరంలో మానసిక వైఫల్యంతో బాధపడుతున్న పిల్లల్ని పరీక్షించటానికి ఇంటెల్లిజన్సు టెస్టుల్ని డిజైన్ చేయించింది ఫ్రెంచి ప్రభుత్వం. ఈ టెస్టులకి రూపకల్పన చేసింది సైకాలజిస్ట్ ఆల్ ఫ్రెడ్ బెనెట్. . ."

జవాబు చెబుతూ చూశాడు విశ్వు . . . కృషి మొహంలో క్రమంగా రంగులుమారిపోతున్నాయి. . . పరిస్థితి చేజారిపోతూందన్న విషయం కృషికీ అర్థమౌతూనే వుంది. . .

ఇప్పుడామె ఆలోచిస్తున్నది కేవలం ఓటమి గురించి మాత్రమే కాదు. ఓటమి తర్వాత తాను పోగొట్టుకోబోతున్న వెలకట్టలేని జీవితం గురించి. . .

"చెస్ - అదే చదరంగానికి మూలం ఏమిటి" అడిగింది కృషి.

"క్రీస్తు శకం ఆరో శతాబ్దం నుంచీ మొదలైన ఈ చదరంగానికి మూలం భారతదేశంలోని ఓ యుద్ధ వ్యూహం 'చతురంగ'-"

విశ్వు జవాబుకి స్పందించిన విద్యార్థులంతా చప్పట్లు కొట్టారు. ఆడిటోరియం ముందు వరుసలో కూర్చున్న చౌదరి కొడుకు రాజేష్ సైతం విశ్వుని సమర్థిస్తూ తన బృందాన్ని

పోరాడేందుకు సాహసించిన కృషిపై రగిలిన ద్వేషం.

"ఆగస్టు నెలకి ముప్పై ఒక్క రోజు లుండడానికి కారణం ఇంపీరియల్ జలసీ అంటారు.... వివరించండి."

"క్రీస్తు పూర్వం 38లో రోమన్ చక్రవర్తి ఆగస్టస్ పేరుని బట్టి జులై తర్వాత నెల ఆగస్టు అనే పేరు నిర్ధారించబడింది. అయితే జూలియస్ సీజరు పేరును సూచించే జులైకి ముప్పై ఒక్కరోజులుండడం, ఆగస్టుకి ముప్పై రోజులుండడం నచ్చని ఆగస్టస్ చక్రవర్తి ఆగస్టుకీ ముప్పై ఒక్క రోజులుండేట్టు చేసి ఫిబ్రవరి నెలకి ఓ రోజు తగ్గించాడు. ఈ చర్యని యింపీరియల్ జలసీగా వర్ణిస్తారు"

మళ్ళీ కరతాళ ధ్వనులు. . ..

కృషిలో టెన్షన్ ఉధృతం కాసాగింది. "తొలిసారి అంతరిక్షంలో అడుగుపెట్టిన ఘనత దక్కించుకున్న రష్యన్ ఆస్ట్రోనాట్ యూరీగగారిన్ మరణం ఎలా సంభవించింది"

"గగారిన్ అంతరిక్షంలో అడుగు పెట్టిన పదేళ్ళకి ఓ జెట్ ప్లేన్ నడుపుతూ విమాన ప్రమాదంలో చనిపోయింది.

కృషి మరో ప్రశ్న అడగబోతుండగా వేదికపైకి ఓ మూలగా వచ్చిన సూరి వేగంగా విశ్నుని సమీపించాడు.

ఏదో చెప్పి విశ్నుకి ఓ స్లిప్పు అందించాడు.

"మేం కిడ్నాప్ చేసుకువెళ్ళిన నీ తల్లి బ్రతకాలి అంటే పోటీలో నువ్వు ఓడిపోవాలి - ఓడేక కుతుబ్‌షాహి సమాధుల దగ్గరకొచ్చి నీ తల్లిని తీసుకువెళ్ళు . . . ఒకవేళ నువ్వు ఈ పోటీలో గెలిస్తే నీకు అక్కడ ఎదురయ్యేది నీ తల్లి శవం మాత్రమే"

ఆ స్లిప్పు తన దగ్గరికి ఎలా వచ్చిదీ సూరి చెబుతుంటే వినలేదు విశ్ను. నుదుటపట్టిన స్వేదాన్ని తుడుచుకుంటూ కృషిని చూశాడు.

మొన్న తను ఏది కోల్పోకూడదని తనపై గూండాల్ని పురమాయించిందో ఇప్పుడు మళ్ళీ కృషి అలాంటి పథకానికి సిద్ధపడింది.

ఓ మనిషిపై మొదలైన అనుమానం ఉధృతం కావటానికి పరిస్థితులు దోహదం చేయడమే నిజమైతే విశ్ను సరిగ్గా అలాంటిస్థితిలో చిక్కుకున్నాడిప్పుడు . . . కృషి తనను చాలా నిస్సహాయుడ్ని చేసింది.

లేనిదాని గురించి వున్నదాన్ని ప్రకటించడం ఉన్నదాన్ని వృదాచేసుకోవడమేనన్న సత్యం తెలిసిన విశ్ను ఆ తర్వాత యిక పోటీపై ఏకాగ్రత చూపించలేదు. వివేకంలేని ఆవేశానికి అర్థం లేదు.

బ్రతుకు మరుభూమిలో పిచ్చి చెట్టులా నిలబడి కోల్పోయిన సౌరభం కోసం ఆర్తిగా దిక్కులు చూస్తున్న అమ్మే తనకు ముఖ్యం తప్ప ఈ గెలుపు కాదు. . .

అంతే.

ఆ తర్వాత కృషి అడిగిన ఏ ప్రశ్నకీ అతడు జవాబు చెప్పలేదు. వున్నట్టుండి అతడిలో కనిపించిన యీ మార్పుకి ఎవరెంత నిశ్చేష్టులైనా గాని అతడి ఓటమిని అమితంగా ఆనందించింది కృషి.

కృషి గెలిచినట్టుగా నిర్ధారించబడింది.

ఆమె చూపుల్లోని స్వాతిశయం విశ్వని మరింత ఉద్రేకపరుస్తుంటే నిభాయించుకుని ఓడినవాడిలా ఆడిటోరియం బయటికి నడిచాడు.

అసలు ఏం జరిగిందో తెలుసుకోవాలని పత్రికా విలేకర్లు అతడ్ని చేరుకోబోతుండగానే అదృశ్యమైన విశ్వ మరో అరగంటలో కుతుబ్‌షాహీ సమాధుల్ని చేరుకున్నాడు.

నిర్జనంగా వుంది. రాత్రి ఎనిమిది గంటల సమయం. . .